సాక్షి అనంతపురం

గురువారం । 20 । ఫిబ్రవరి । 2025



చీనీ టన్ను రూ.23,390

అనంతపురం మార్కెట్‌యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.23,390 పలికాయి.



టమాట కిలో రూ.10

అనంతపురం కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.10 పలికింది. కనిష్టం రూ.7, సరాసరి రూ.9 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం 38.1°/17.3°

జిల్లా అంతటా బుధవారం ఉదయం చలి వాతావరణం కొనసాగింది. పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

రెవెన్యూ సమస్యల్ని పరిష్కరించాలి



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: ''రెవెన్యూశాఖ పరిధిలోని సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలి. ఏ ఒక్క అర్జీ పెండింగ్‌లో ఉండడానికి వీలులేదు'' అని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ రెవెన్యూ డివిజన్, మండలస్థాయి అధికారులను ఆదేశించారు. బుధవారం తన క్యాంపు కార్యాలయం నుంచి జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, డీఆర్‌ఓ ఎ.మలోల, ఆర్‌డీఓలు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, ఆర్‌ఎస్‌డీటీలు, మండల సర్వేయర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సేవలకు సంబంధించి చుక్కల భూములు, మ్యుటేషన్ దరఖాస్తులు, వివాహ, సమీకృత, కుటుంబ సభ్యుల సర్టిఫికెట్లు, మ్యుటేషన్ ఫార్ ట్రాన్సాక్షన్, పాసుపుస్తకం సేవలు తదితర అంశాలకు సంబంధించిన ఫిర్యాదులు, దరఖాస్తులు పరిష్కరించాలన్నారు. అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అర్జీలు పరిష్కరించారా.. లేదా?

ఆత్మకూరు: రెవెన్యూ సదస్సుల్లో అందిన అర్జీలను పరిష్కరించారా లేదా అని క్షేత్ర స్థాయిలో కలెక్టర్ వినోద్‌కుమార్ పరిశీలించారు. ఆత్మకూరు మండలంలోని మదిగుబ్బలో బుధవారం ఆయన పర్యటించారు. గ్రామానికి చెందిన జింకల నరసింహులు అనే రైతు తన భూమికి దారి చూపించాలంటూ అందించిన అర్జీపై ఆరా తీశారు. ఇరు వర్గాలతో మాట్లాడారు. ప్లాన్ మార్క్ ప్రకారం రస్తా చూపించాలని ఆర్డీఓ, తహసీల్దార్‌ను ఆదేశించారు. మిగిలిన భూమిలో చట్ట ప్రకారం హక్కులు కల్పిస్తామని స్పష్టం చేశారు. ఎవరూ గొడవలు చేసుకోరాదని హితవు పలికారు.

1962 హెల్ప్‌లైన్ మూగబోయింది. మొబైల్ వెటర్నరీ క్లినిక్‌లు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. మారుమూల పల్లెల్లో సైతం అందించే విశిష్ట పశువైద్య సేవలు నిలిచిపోయాయి. ఎన్నో అరుదైన, కష్టసాధ్యమైన శస్త్రచికిత్సలు చేసి మూగజీవాలకు ప్రాణదానం చేసిన మొబైల్ అంబులెన్స్‌లు నేడు రోడ్డెక్కడం లేదు. నాలుగు రోజుల క్రితం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 14 అంబులెన్స్‌లు నిలిచిపోగా... రేపో మాపో మిగిలిన అంబులెన్స్‌లు కూడా ఆగిపోనున్నాయి.

1962 మొబైల్ అంబులెన్స్‌లు (ఫైల్)



పశువైద్యం.. పచ్చ గ్రహణం

- 1962 అంబులెన్సులపై కూటమి సర్కారు కక్ష
- ఉమ్మడి జిల్లాలో 14 మొబైల్ అంబులెన్స్‌ల నిలిపివేత
- 108 మాదిరిగా పశువుల కోసం అంబులెన్స్‌లు తెచ్చిన జగన్ సర్కారు
- మారుమూల ప్రాంతాల్లో సైతం విశిష్ట సేవలు అందించేలా చర్యలు
- చంద్రబాబు ప్రభుత్వ తీరుపై పాడి రైతుల ఆగ్రహం

అనంతపురం అగ్రికల్చర్: దేశంలోనే తొలిసారిగా దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డి రాష్ట్రంలో 108 అంబులెన్స్‌లు ప్రవేశపెట్టారు. పేదలకు ఎంతో సాంత్వన చేకూర్చారు. తండ్రి స్ఫూర్తితో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో అడుగు ముందుకు వేసి మూగ జీవాల కోసం సైతం మొబైల్ అంబులెన్స్‌లు తీసుకువచ్చారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఏర్పాటు చేసిన ఈ అంబులెన్సులు మంచి ఫలితాలు ఇవ్వడంతో నియోజకవర్గాలకు రెండు చొప్పున సమకూర్చారు. నెలకు రూ.40 వేల నుంచి రూ.50 వేల విలువ చేసే మందులు సైతం ఉచితంగా అందించారు.అర్హత కలిగిన పశువైద్యులు, ఒక పారావెట్, పైలెట్ కింద డ్రైవర్‌ను నియమించారు. 1962 టోల్‌ఫ్రీ నంబరు ఏర్పాటు చేశారు. రైతుల నుంచి ఫోన్ రాగానే 108 మాదిరిగానే మారుమూల ప్రాంతాలకు వెళ్లి రైతు ఇంటి వద్దే మూగజీవాలకు వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకున్నారు. మూగజీవాలు మరీ ప్రమాదకర స్థితిలో ఉన్నప్పుడు అంబులెన్స్ ద్వారానే సమీప పశువుల ఆస్పత్రికి తీసుకువచ్చి పశుసంవర్ధక శాఖ డాక్టర్లు, ఏడీల సహకారంతో అరుదైన, కష్టసాధ్యమైన శస్త్రచికిత్సలు చేసి ప్రాణం పోశారు.



ఆవుకు హెర్నియా ఆపరేషన్ చేస్తున్న దృశ్యం (ఫైల్)

కక్ష గట్టి నిలిపివేత..

ఉన్నతాశయంతో గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన 1962 అంబులెన్స్‌లపై కూటమి ప్రభుత్వం కక్ష కట్టింది. కాంట్రాక్టు ముగిసిందనే నెపంతో 14 అంబులెన్స్‌లను ఈనెల 16 నుంచి నిలిపివేసింది. మరికొన్ని రోజుల్లో మిగిలిన అంబులెన్స్‌లు కూడా నిలిచిపోనున్నట్లు తెలిసింది. ఉన్నపళంగా 1962 అంబులెన్స్ సేవలను నిలిపివేయడంపై రైతులు, కాపర్లు మండిపడుతున్నారు. మూగజీవాల వైద్య సేవలకు అంతరాయం ఏర్పడుతోందని వాపోతున్నారు. మరోపక్క 1962 అంబులెన్స్‌ల్లో పనిచేస్తున్న డాక్టర్లు, సిబ్బంది పరిస్థితి కూడా అగమ్యగోచరంగా మారింది. కొత్త సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంటే తమ పరిస్థితి ఏమిటని ఉద్యోగులు వాపోతున్నారు. తమకు రావాల్సిన బకాయిల సంగతి కూడా తేల్చకుండానే కూటమి సర్కారు వ్యవహరిస్తున్న తీరుపై ఆందోళన చెందుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో పశువులు, ఎద్దులు	4,97,102
గేదెలు	2,85,443
గొర్రెలు	49,26,587
మేకలు	8,84,186
పందులు	12,767
కోళ్లు	25 లక్షలు
కుక్కలు	1.57 లక్షలు
1962 మొబైల్ అంబులెన్స్‌లు	28

రోడ్డున పడేయొద్దు



1962 అంబులెన్స్ డాక్టర్లు, సిబ్బంది

తమ కుటుంబాలు రోడ్డున పడకుండా ఆదుకోవాలని 1962 మొబైల్ అంబులెన్స్ డాక్టర్లు, పారావెట్స్, డ్రైవర్లు వేడుకున్నారు. ఉన్నపళంగా మొదటి విడత అంబులెన్స్‌లు నిలిపివేయడంపై ఆందోళన వ్యక్తం చేస్తూ బుధవారం అనంతపురం పశుసంవర్ధక శాఖ జేడీ కార్యాలయంలో జేడీ డాక్టర్ జీపీ వెంకటస్వామిని కలిసి వినతి పత్రం సమర్పించారు. ముందస్తు సమాచారం లేకుండానే అంబులెన్స్‌లు నిలిపివేయడంతో తమ కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉందన్నారు. తమకు రావాల్సిన బకాయిలు చెల్లించడంతో పాటు సంస్థ మారినా మళ్లీ తమనే విధుల్లోకి తీసుకునేలా చూడాలని కోరారు. జేడీని కలిసిన వారిలో డాక్టర్ శృతి, డాక్టర్ హైమ, డాక్టర్ కరణ్, డాక్టర్ మంజుశ్రీ, సిబ్బంది మహదీప్, ఆకాష్, వినోద్, షరీఫ్, పవన్‌సాయి, కళ్యాణ్ బాబు తదితరులు ఉన్నారు.

1 నుంచి ఇంటర్ పరీక్షలు



అనంతపురం కొత్తూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రశ్నపత్రాలకు పోలీస్ బందోబస్తు

అనంతపురం ఎడ్యుకేషన్: ఇంటర్ పరీక్షలు మార్చి 1 నుంచి ప్రారంభం కానున్నాయి. బుధవారంతో ప్రాక్టికల్ పరీక్షలు ముగియడంతో థియరీ పరీక్షలకు విద్యార్థులు సన్నద్ధం అవుతున్నారు. మార్చి 20 వరకు థియరీ పరీక్షలుంటాయి. జిల్లా వ్యాప్తంగా 63 కేంద్రాలు ఏర్పాటు చేశారు. జనరల్, ఒకేషనల్ కలిపి 48,690 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. వీరిలో మొదటి సంవత్సరం విద్యార్థులు 25,730 మంది కాగా 12,397 మంది బాలురు, 13,333 మంది బాలికలు ఉన్నారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 22,960 మంది కాగా వీరిలో 11,064 మంది బాలురు, 11,896 మంది బాలికలు ఉన్నారు. పరీక్ష ప్రశ్నపత్రాలు జిల్లాకు చేరుతున్నాయి. స్థానిక కొత్తూరు ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో భద్రపరుస్తున్నారు. పరీక్షలపై ఏవైనా సందేహాలుంటే నివృత్తి చేసేందుకు ప్రత్యేకంగా కంట్రోల్ రూం (నం.08554-274256) ఏర్పాటు చేస్తున్నారు. పరీక్షల సమయంలో ప్రశ్నపత్రాలను లీక్ చేస్తే అడ్డంగా దొరికిపోతారు. ప్రశ్నపత్రాలపై క్యూ ఆర్ కోడ్ ఉంటుంది. పొరపాటున బయట ప్రశ్నపత్రం దొరికిందా... దానిపై ఉన్న క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే అది ఏ కేంద్రానికి కేటాయించిందో ఇట్టే తెలిసిపోతుంది.

వెబ్‌సైట్‌లో హాల్ టికెట్లు..

విద్యార్థులు హాల్‌టికెట్లను https://bie.ap.gov.in వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు ఫీజులకు, హాల్ టికెట్లకు ముడిపెట్టొద్దని, ఎవరైనా అలా చేస్తే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఈ సందర్భంగా 'సాక్షి'తో జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ కన్వీనర్, ఇంటర్ బోర్డు ఆర్‌ఐఓ ఎం. వెంకటరమణనాయక్ మాట్లాడుతూ పరీక్ష కేంద్రాలకు ముందురోజే వెళ్లి సంబంధిత కళాశాల యాజమాన్యంతో నిర్ధారించుకోవాలని సూచించారు.

వర్సిటీ పురోగతికి సమష్టి కృషి



వీసీగా బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రొఫెసర్ సుదర్శనరావు

అనంతపురం: జేఎన్‌టీయూ(ఏ) పురోగతికి సమష్టిగా కృషి చేద్దామని నూతన వీసీ ప్రొఫెసర్ హెచ్. సుదర్శనరావు అన్నారు. బుధవారం ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సీనియర్ ప్రొఫెసర్లు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్సిటీ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు. ప్రతి ఉద్యోగి సహకారంతోనే సమగ్రాభివృద్ధి సాధ్యమన్నారు.

బాడుగకిస్తే బాధే మిగులుతోంది!

- అనంతపురం రాజు రోడ్డులోని ఓ ఆప్టికల్ (కళ్లద్దాల) షాపు భవనాన్ని భాస్కర్‌రెడ్డి అనే వ్యక్తి కొనుగోలు చేశారు. అనంతరం అమ్మిన వ్యక్తికే అద్దెకిచ్చారు. ఆ తర్వాత భాస్కర్ రెడ్డికి సదరు వ్యక్తి అద్దె ఇవ్వకుండా మొండికేశారు. తన బంధువులతో కోర్టులో కేసు వేయించారు. అష్టకష్టాలు పడిన భాస్కర్ రెడ్డి మూడేళ్ల తర్వాత భవనాన్ని సొంతం చేసుకోగలిగారు.
- భవనానికి బాడుగ ఇవ్వక, ఖాళీ చేయక ఇబ్బంది పెడుతున్నారంటూ ఇటీవల ఓ ఫిర్యాదుదారు అనంతపురం త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. ఈ కేసులో విచారణ కోసం పోలీసులు ఓ న్యాయవాదిని పిలవగా.. ఆయన గుండెపోటుతో మృతి చెందారు. ఈ రెండే కాదు.. జిల్లాఅంతటా ఇదే పరిస్థితి. అద్దెకు తీసుకున్న వారు సరిగా బాడుగ చెల్లించక, భవనాన్ని ఖాళీ చేయకపోవడంతో ఓనర్లు నానా తంటాలు పడుతున్నారు.

- భవనాలను ఖాళీ చేయని అద్దెదారులు
- అవసరమైతే కోర్టులకు వెళ్లి స్టే ఆర్డర్లు
- పోలీసులను ఆశ్రయిస్తున్న ఓనర్లు
- రోజుకు 10 పైనే కేసులు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: 'మనవాళ్లే కదా.. అంతా బాగుంటుంది లే' అనుకుంటూ భవనాన్ని అద్దెకిచ్చిన పాపానికి ఓనర్లు అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. అద్దెదారులు చివరకు 'ఖాళీ చేయం.. నీ దిక్కున్న చోట చెప్పుకో' అంటూ ధిక్కరిస్తున్న పరిస్థితి. పైగా కోర్టుకు వెళ్లడం.. ఇప్పుడే ఖాళీ చేయలేమని గడువుతో కూడిన స్టే ఆర్డర్ తెచ్చుకోవడం.. ఆ గడువు కూడా ముగిసినా ఖాళీ చేయకపోవడం... ఇదీ దుస్థితి. ఈ క్రమంలో పోలీసులను ఆశ్రయించినా ఫలితం లేకపోవడంతో భవన యజమానులు కన్నీటి పర్యంతమవుతున్నారు. అద్దె కరెక్టుగా ఇచ్చేవారికి కూడా కొందరి ఆగడాలతో బాడుగకు భవనం దొరకడం కష్టతరమవుతోంది.

'క్రాంతి'.. భ్రాంతి

అనంతపురం గుత్తిరోడ్డులోని ఓ అద్దె భవనంలో క్రాంతి హాస్పిటల్ నడుస్తోంది. నెలకు అద్దె రూ.3.25 లక్షలు చెల్లించేలా ఒప్పందం చేసుకున్నారు. 2021లోనే భవనం అద్దె లీజు ముగిసింది. ఈ క్రమంలో భవనాన్ని ఖాళీ చేయాలని అనేక సార్లు ఓనరు అడిగినా స్పందన లేకుండా పోయింది. పైగా గడిచిన 14 నెలల నుంచి అద్దె కూడా చెల్లించలేదు. దీంతో భవన యజమాని నగేష్ 2024 డిసెంబరులో ఎస్పీకి ఫిర్యాదు చేయగా... పరిష్కారం చూపాలంటూ అనంతపురం త్రీ టౌన్ పోలీసులను ఆయన ఆదేశించారు. అయితే, సదరు పోలీసుల నుంచి సరైన స్పందన లేకపోవడంతో ఆస్పత్రి వద్ద భవన యజమాని బుధవారం ధర్నాకు దిగారు. ఈ క్రమంలో ఆస్పత్రి నిర్వాహకుడు మురళి దిగిరాకపోగా బాధితుడిపైనే దౌర్జన్యం చేశారు. 'దిక్కున్న చోట చెప్పుకో' అంటూ బెదిరించాడని నగేష్ ఆవేదన వ్యక్తం చేశారు.

వందలాది కేసులు..

అనంతపురంలోనే కాదు కళ్యాణదుర్గం, రాయదుర్గం, ధర్మవరం, కదిరి, గుంతకల్లు పట్టణాల్లోనూ ఇలాంటి కేసులు ఉత్పన్నమవుతున్నాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలో సగటున రోజుకు 10 కేసులు నమోదవుతున్నాయి. అద్దెకున్న వారు ఖాళీ చేయకపోవడంతో బిల్డింగ్ యజమానులు పోలీసులను ఆశ్రయిస్తున్నారు. కొంతమంది విదేశాల్లో ఉంటూ ఇక్కడ అద్దెకిస్తే ఆ ఇళ్లకు ఏకంగా ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించి కుదువకు పెట్టిన వారూ ఉన్నట్లు సమాచారం.



వివాదానికి కేంద్ర బిందువుగా మారిన అనంతపురంలోని క్రాంతి హాస్పిటల్ భవనం

అద్దె ఇప్పించే ఉద్యోగం కాదు మాది

అద్దెకిచ్చిన ఇంటికి రెంటు ఇప్పించడమో, ఖాళీ చేయించడమో చేసే ఉద్యోగం కాదు మాది. ఇలాంటి వాటి జోలికొస్తే సివిల్ పంచాయితీల్లో ఎందుకు తలదూరుస్తారు అంటారు. అందుకే కోర్టుకెళ్లి తేల్చుకోండి అని చెబుతున్నాం. మా పరిధిలో ఉన్నవి మాత్రమే పరిష్కరిస్తాం.

–శాంతిలాల్, సీఐ, త్రీటౌన్ పోలీస్ స్టేషన్

సీసీ కెమెరాల్లేవు.. రికార్డుల ఊసే లేదు

- ఎస్‌ఆర్ కళాశాలలో భద్రత డొల్ల
- రోజంతా పత్తా లేకుండా పోయిన ప్రిన్సిపాల్

అనంతపురం ఎడ్యుకేషన్: అనంతపురం రూరల్ ఆలమూరు రోడ్డులో ఉన్న ఎస్‌ఆర్ జూనియర్ కళాశాలలో డొల్లతనం బయట పడింది. రెసిడెన్షియల్ కళాశాల నిర్వహణలో తీసుకోవాల్సిన కనీస చర్యలు పాటించడం లేదని వెల్లడైంది. కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థి శ్రీకాంత్ సోమవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. విద్యార్థి మృతిపై అనుమానాలు తలెత్తుతుంటే, మరోవైపు కళాశాలలో కనీస భద్రత చర్యలు లేకపోవడంపై చర్చ జరుగుతోంది. కళాశాలలో సీసీ కెమెరాలు లేవు. కాంపౌండ్ ఎత్తు లేదు. విద్యార్థుల అటెండెన్స్ నిర్వహణ లేదు. సెక్యూరిటీ లేడు. గేటు వద్ద కచ్చితంగా రిజిస్టర్ నమోదు చేయాల్సి ఉంటుంది. ఎవరైనా విద్యార్థి బయటకు వెళ్లాలంటే యాజమాన్యంతో అనుమతి తీసుకోవాలి. బంధువులు వస్తే వారి ఊరు, పేరు, సంతకం, వచ్చిన సమయం రిజిస్టర్‌లో నమోదు చేసిన తర్వాతనే విద్యార్థిని బయటకు పంపాల్సి ఉంటుంది. ఇక్కడ అలాంటిదేమీ జరగలేదు. రాత్రి విద్యార్థి బయటకు పోతే వార్డెన్ ఏం చేస్తున్నాడు?ఎందుకు గుర్తించలేదు? ఈ ప్రశ్నలకు సమాధానాలు కరువయ్యాయి. ఇక.. రాత్రి పడుకునే ముందు అన్ని గదుల్లోకి వెళ్లి విద్యార్థుల అటెండెన్స్ తీసుకోవాలి... అలా జరిగి ఉంటే విద్యార్థి శ్రీకాంత్ లేడనే విషయం అప్పుడే వెలుగు చూసేది. కానీ ఇక్కడ మాత్రం మరుసటి రోజు ఉదయం విద్యార్థి చెట్టుకు ఉరికి వేలాడుతూ కనిపించేదాకా ఆ విద్యార్థి బయటకు వెళ్లాడనే సమాచారమే లేకపోవడం గమనార్హం.





ఎస్‌ఆర్ జూనియర్ కళాశాల, ఆర్‌ఐఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న విద్యార్థి నాయకులు

ప్రిన్సిపాల్ సెల్ స్విచ్చాఫ్..

కళాశాల ప్రిన్సిపాల్ జగదీష్‌బాబు మంగళవారం ఉదయం 7.45 గంటలకు కళాశాలకు వచ్చాడు. విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడనే విషయం తెలీగానే అక్కడి నుంచి వెళ్లిపోయి తన మొబైల్ ఫోన్ స్విచ్చాఫ్ చేసుకున్నాడు. పోలీసులు ఆయన ఇంటివద్దకు వెళ్తే అందుబాటులో లేరు. తీరిగ్గా బుధవారం ఉదయం కళాశాలకు రావడం విమర్శలకు తావిచ్చింది.

డీఎస్పీ ఆగ్రహం..

విద్యార్థుల భద్రతకు జాగ్రత్తలు తీసుకోకపోవడంపై అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కళాశాలను బుధవారం ఆయన సందర్శించారు. ఏజీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఫీజులు వసూళ్లు చేసినంతగా విద్యార్థులకు భద్రత కల్పించాల్సిన బాధ్యత లేదా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాత్రి బయటకు పోయిన విద్యార్థి ఉదయం శవమై తేలేంత వరకూ తెలీదా అని ప్రశ్నించారు. 'తరచూ రౌండ్స్‌కు వస్తుంటారు కదా... కళాశాలలో విద్యార్థుల భద్రతకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారనేది పరిశీలించక పోతే ఎలా?' అని రూరల్ పోలీసులపైనా అసహనం వ్యక్తం చేశారు. కాగా, ఇంటర్ బోర్డు అధికారులు కూడా ఈ విషయంలో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, తరచూ కళాశాలలను తనిఖీలు చేసి, లోపాలుంటే సరిదిద్దేలా ఆదేశాలు జారీ చేసి ఉంటే ఈరోజు ఇంతటి పరిస్థితి ఉండేది కాదని విద్యార్థి సంఘాల నాయకులు చెబుతున్నారు.

క్రిమినల్ కేసు నమోదు చేయాలి..

ఎస్‌ఆర్ జూనియర్ కళాశాల విద్యార్థి శ్రీకాంత్ ఆత్మహత్యపై సమగ్ర విచారణ జరిపించి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఏఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ, ఏఐఎస్బీ, బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ విద్యార్థి సమైక్య ఆధ్వర్యంలో స్థానిక ఆర్‌ఐఓ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. తక్షణమే యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్‌ఐఓ వెంకటరమణనాయక్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు కుళ్లాయిస్వామి, పరమేష్, పృథ్వీ, సురేష్, హనుమంతరాయుడు, వంశీ, చందు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య



కావ్యబాయి(ఫైల్)

ఉరవకొండ: మండల పరిధిలోని లత్తవరం తండా గ్రామానికి చెందిన ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థిని కావ్యబాయి (16) ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు.. లత్తవరం తండా గ్రామానికి చెందిన ఈశ్వర్‌నాయక్, జానకి బాయి దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం. పెద్ద కుమార్తె కావ్యబాయి ఉరవకొండ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం (సీఈసీ) చదువుతోంది. మూడు రోజుల నుంచి కళాశాలకు వెళ్లకుండా ఇంట్లోనే ఉంది. బుధవారం ఉదయం కూలి పనులకు వెళ్లిన ఈశ్వర్‌నాయక్, జానికి బాయిలు మధ్యాహ్నం ఇంటికి రాగా, కావ్య బాయి ఫ్యాన్‌కు ఉరికి వేలాడుతూ కనిపించింది. వెంటనే కుమార్తెను కిందికి దించి ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. విద్యార్థిని మృతికి దారితీసిన కారణాలు తెలియరాలేదు. ఎస్‌ఐ జనార్దన్‌నాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బొప్పాయి చెట్ల నరికివేత

బ్రహ్మసముద్రం: మండలంలోని రాయలప్పదొడ్డి పంచాయతీ యనకల్లు గ్రామ సమీపంలో సర్పంచ్ రామ్మోహన్ సాగు చేసిన బొప్పాయి చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు నరికి వేశారు. మంగళవారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. తనకున్న 5 ఎకరాల్లో రామ్మోహన్ బొప్పాయి సాగు చేపట్టారు. గిట్టని వారు తోటలోకి చొరబడి పిందె దశలో ఉన్న 70కి పైగా చెట్లను నరికి వేశారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధిత రైతు తెలిపారు.

క్లుప్తంగా

అన్ని సౌకర్యాలుంటేనే సబ్సిడీ పరికరాలు

- ఏపీఎంఐపీ ఏపీడీ ఫిరోజ్‌ఖాన్


సిబ్బందితో మాట్లాడుతున్న ఫిరోజ్‌ఖాన్

కూడేరు: బోరు, మోటార్, విద్యుత్ తదితర అన్ని సౌకర్యాలున్న రైతులకే ప్రభుత్వం సబ్సిడీతో సూక్ష్మ సేద్యం పరికరాలు అందిస్తుందని ఏపీఎంఐపీ ఏపీడీ ఫిరోజ్‌ఖాన్ అన్నారు. బుధవారం ఆయన కూడేరు, ఇప్పేరులోని రైతు సేవాకేంద్రాలను సందర్శించారు. రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతుల పొలాల్లో బోరు వద్ద ఫొటోలు తీసి అప్‌లోడ్ (పీఏఆర్) చేసే అంశంలో చోటు చేసుకున్న జాప్యంపై సిబ్బందితో సమీక్షించారు. మార్చిలోపు అన్నింటినీ పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. కూడేరు మండల వ్యాప్తంగా ఇంకా 405 మంది రైతుల పొలాల్లో ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయడం, జియో టాగింగ్ చేయడం ఉన్నాయన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులు అందుబాటులో ఉండి సిబ్బందికి సహకరిస్తే ఈ ప్రక్రియ త్వరగా పూర్తవుతుందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ హార్టికల్చర్ ఆఫీసర్ నెట్టికంటయ్య, వీహెచ్‌ఏ సాజియా, ఎంపీఈఓ జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై హత్యాయత్నం


గాయపడిన విజయభాస్కరరెడ్డి, రామ్మోహన్

పెద్దవడుగూరు: మండలంలోని అప్పేచర్లలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై స్థానిక టీడీపీ నేతలు హత్యాయత్నం చేశారు. పోలీసులు తెలిపిన మేరకు... గ్రామానికి చెందిన టీడీపీ నేత ప్రకాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ కార్యకర్త విజయభాస్కరరెడ్డి మధ్య కొంత కాలంగా స్థల వివాదం నడుస్తోంది. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం గ్రామ సమీపంలోని జాతీయ రహదారి పక్కన ఉన్న వెంచర్‌లో విజయభాస్కరరెడ్డి పని చేస్తుండగా అక్కడికి టీడీపీ నేతలు ప్రకాష్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి చేరుకుని వాగ్వాదానికి దిగారు. మాటలతో రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తుండడాన్ని గమనించిన విజయభాస్కరరెడ్డి అక్కడి నుంచి ఇంటికి వెళ్లేందుకు సిద్ధమవుతుండగా అడ్డుకుని వేట కొడవలి, ఇనుప పైపులతో దాడి చేశారు. ఘటనలో విజయభాస్కరరెడ్డి తలకు తీవ్ర గాయాలయ్యాయి. అడ్డుకోబోయిన ఆయన తమ్ముడు రామ్మోహన్‌రెడ్డిపై సైతం టీడీపీ నేతలు దాడిచేయడంతో ఆయన కూడా తీవ్రంగా గాయపడ్డాడు. ఘటనపై బాధితులు ఫిర్యాదు చేసేందుకు పోలీస్ స్టేషన్‌కు వెళితే.. దాడికి పాల్పడిన వారు సైతం అక్కడకు చేరుకుని ప్రతిగా ఫిర్యాదు చేశారు. ఘటనకు సంబంధించి ఇరువర్గాలపై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపారు.

నీటి తొట్టెలు వెలవెల.. వన్యప్రాణి విలవిల!

- ఎండల తీవ్రతతో అల్లాడుతున్న వన్యప్రాణులు
- నీటి కోసం గ్రామాల్లోకి చొరబడుతున్న వైనం
- ఎండలు ముదురుతున్నా ప్రత్యామ్నాయం చేపట్టని ప్రభుత్వం
- నిధులు మంజూరు చేయకపోవడంతోనే ఇబ్బంది అంటున్న అటవీ అధికారులు



నాడు మానిరేవు బీట్‌లో తొట్టెలోకి నీరు పడుతున్న అటవీ సిబ్బంది (ఫైల్)

వన్యప్రాణుల సంరక్షణకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టింది. వేసవిలోనే కాదు.. మిగిలిన అన్ని సీజన్లలోనూ నీటి కోసం వన్యప్రాణులు విలవిల్లాడకుండా ఉండేందుకు అటవీ ప్రాంతాల్లో ప్రత్యేకంగా తొట్టెలు ఏర్పాటు చేసి, క్రమం తప్పకుండా వాటిని నీటితో నింపుతూ వచ్చింది. ఈ చర్యలతో అటవీ ప్రాంతాన్ని వీడి ఏనాడూ వన్యప్రాణులు గ్రామాల బాట పట్టింది లేదు.

వన్యప్రాణుల సంరక్షణపై ప్రస్తుత కూటమి సర్కార్ ఉదాసీనత కనబరుస్తోంది. వేసవి ప్రారంభం కాక ముందే ఎండలు తీవ్ర ప్రభావం చూపుతున్నా ఇప్పటి వరకూ వన్యప్రాణుల దాహార్తిని తీర్చే చర్యలు చేపట్టలేదు. ఫలితంగా గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన నీటి తొట్టెలు నిరుపయోగంగా మారడంతో దాహం తీర్చుకునేందుకు వన్యప్రాణులు గ్రామాల బాట పడుతున్నాయి.


నేడు మానిరేవు బీట్‌లో నీరు లేక ఖాళీగా ఉన్న నీటి తొట్టె

రాయదుర్గం: వేసవి ప్రారంభానికి ముందే ఫిబ్రవరి రెండో వారంలోనే భానుడు ప్రచండ నిప్పులు చెరుగుతున్నాడు. సూర్యుడి ప్రతాపానికి జిల్లా నిప్పుల కొలిమిని తలపిస్తోంది. పలు గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో ఇప్పటికే తాగునీటి ఎద్దడి నెలకొంది. ఇక అటవీ ప్రాంతంలోని వన్యప్రాణులు గొంతు తడుపుకునేందుకు గుక్కెడు నీరు దొరకకపోవడంతో గ్రామాల బాట పడుతున్నాయి. దాహార్తి తీరేలోపు చాలా మూగజీవాలు మృత్యువాత పడుతుండగా, మరికొన్ని వీధి కుక్కలు, వేటగాళ్ల బారిన పడి చనిపోతున్నాయి. వన్యప్రాణి సంరక్షణపై కూటమి సర్కార్ ఉదాసీనత కనబరుస్తుండడంతో పరిస్థితి మరింత జఠిలంగా మారుతోంది. రాయదుర్గం, కళ్యాణదుర్గం, కణేకల్లు, ఉరవకొండ, వజ్రకరూరు, కుందుర్పి, బ్రహ్మసముద్రం, కూడేరు తదితర గ్రామాల్లో ఇప్పటికే ఎలుగుబంట్లు, చిరుతలు, తాడిపత్రి, యాడికి, యల్లనూరు, పుట్లూరు, పెద్దపప్పూరు, పెద్దవడుగూరు, గుత్తి, గుంతకల్లు పరిసర ప్రాంతాల్లో జింకలు, దుప్పిలు, కుందేళ్లు. ఇతర మూగజీవాలు దాహం తీర్చుకునేందుకు జనావాసాల్లోకి చొరబడుతున్నాయి. అటవీ ప్రాంతాల్లో సరైన నీటి వసతిని ప్రభుత్వం కల్పించకపోవడంతోనే సమీప పొలాల్లోని ట్యాంకుల్లో దాహం తీర్చుకునేందుకు వన్యప్రాణులు వస్తుంటాయని రైతులు అంటున్నారు.

వంద తొట్టెల నిర్మాణం

జిల్లాలోని మూడు ఫారెస్ట్ రేంజ్‌ల పరిధిలో 74,400 హెక్టార్లలో విస్తరించిన అటవీ ప్రాంతం వేలాది వన్యప్రాణులకు ఆశ్రయం కల్పిస్తోంది. ఈ క్రమంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వన్యప్రాణి సంరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టింది. జిల్లాలోని అన్ని ఫారెస్ట్ రేంజ్‌లలో సుమారు వందకు పైగా నీటి తొట్టెలను నిర్మించింది. ఇందు కోసం రూ.లక్షలు వెచ్చించింది. వీటికి తోడు సాసర్ రింగ్స్, చెక్‌డ్యామ్‌లు, పెర్కోలేషన్ ట్యాంకులు, నీటి కుంటల్ని నిర్మించి సీజన్‌తో సంబంధం లేకుండా క్రమం తప్పకుండా నీటితో నింపుతూ వస్తుండడంతో ఏనాడూ వన్యప్రాణాలు అటవీ ప్రాంతాన్ని వీడి జనావాసాల్లోకి వచ్చింది. లేదు. అడవుల సరంక్షణ, వన్యప్రాణుల చట్టాలపై సమీప గ్రామాల ప్రజల్లో విస్తృత చైతన్యం తీసుకువచ్చింది. దీంతో కారుచిచ్చు నుంచి అడవుల్ని కాపాడుకునే బాధ్యత ప్రజలే స్వచ్ఛందంగా తీసుకున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత వన్యప్రాణి సంరక్షణ చర్యలు మచ్చుకైనా కనిపించడం లేదని గ్రామీణులు అంటున్నారు. దీంతో అడవికి అందాలుగా చెప్పుకునే వన్యప్రాణులు దాహంతో అలమటిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిధులు లేవు

వన్యప్రాణుల సంరక్షణకు కంపా, బయోసాట్ పథకాల కింద నిధులు అందాల్సి ఉంది. ప్రస్తుతం కంపా పథకం కింద రూ.50 వేలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. అంతకు మించి నిధులేమీ లేవు. అన్నీ రేంజ్‌ల పరిధిలోనూ వన్యప్రాణుల తాగునీటి అవసరాలను గుర్తించాం. దానికి తగినట్లుగా నీటి వసతి ఏర్పాటుకు ప్రణాళికలు చేపట్టాం. వన్యప్రాణులతో పాటు అడవులను కాపాడుకునే బాధ్యత తీసుకున్నాం. అవసరమైనచోట సాసర్‌రింగ్స్‌ను అందుబాటులోకి తీసుకోస్తాం.

– విఘ్నేష్ అప్పావు, డీఎఫ్‌ఓ, అనంతపురం

గొంతు తడవక సొమ్మసిల్లి...


నెమలిని పోలీసులకు అప్పగిస్తున్న రైతులు

పుట్టపర్తి: గొంతు తడుపుకునేందుకు గుక్కెడు నీరు దొరక్కపోవడంతో ఓ మామిడి తోటలో వాలిన జాతీయ పక్షి నెమలి... అక్కడే సొమ్మసిల్లి పడిపోయింది. బుక్కపట్నం గ్రామానికి చెందిన రైతు చిట్రా నారాయణస్వామి తోటలో బుధవారం ఈ ఘటన చోటు చేసుకుంది. విపరీతమైన దాహంతో సొమ్మసిల్లిన నెమలిని గమనించిన కొత్త చెరువుకు చెందిన విశ్రాంత సైనికోద్యోగి రవిచంద్ర వెంటనే దానికి సపర్యలు చేపట్టారు. బిందెలతో నీటిని దానిపై పోసిన కాసేపటికి తేరుకుంది. అయినా పైకి స్వేచ్ఛగా ఎగరలేక ఇబ్బంది పడుతుంటే రైతు నారాయణస్వామితో కలసి పోలీసులకు అప్పగించారు. అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల దాహార్తిని తీర్చేందుకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో గొంతు తడుపుకునేందుకు మూగజీవాలు పడుతున్న ఇబ్బందులకు ఇదొక ఉదాహరణ మాత్రమే. ఇలాంటి ఘటనలో కోకొల్లలుగా చోటు చేసుకుంటున్నా.. వెలుగులోకి కొన్ని మాత్రమే వస్తున్నాయి. సకాలంలో రైతులు గుర్తించడంతో నెమలికి ప్రాణాపాయం తప్పింది. దాహంతో అలమటిస్తున్న పలు వన్యప్రాణులు నీరు అందక మృత్యువాత పడుతుండడం బాధాకరం.

కొరవడిన ముందుచూపు

- ఇంటర్వ్యూలు నిర్వహించలేక చేతులెత్తేసిన అధికారులు


ఇంటర్వ్యూలకు భారీగా హాజరైన దరఖాస్తుదారులు

గుంతకల్లు టౌన్: బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు అందించేందుకు గానూ బుధవారం ఉదయం మున్సిపల్ కార్యాలయంలో చేపట్టిన ఇంటర్వ్యూలు నిర్వహించలేక అధికారులు చేతులెత్తేశారు. ఫలితంగా ఇంటర్వ్యూలు వాయిదాపడ్డాయి. ఇంటర్వ్యూలకు ఒక్క రోజు ముందు పత్రికా ప్రకటన ఇవ్వడం... ప్రణాళిక లేకుండా అర్ధ రోజులోనే ఇంటర్వ్యూలను ముగించాలనుకోవడం అధికారిక వైఫల్యాలకు కారణంగా తెలుస్తోంది. ముందు చూపులేని అధికారులు హడావుడిగా తీసుకున్న నిర్ణయాల వల్ల మండుటెండల్లో అభ్యర్థులు నానా తిప్పలు పడ్డారు. ఒకానొక దశలో తోపులాట చోటు చేసుకోవడంతో తోపులాటను చూసి బ్యాంకు అధికారులు భయాందోళనలకు గురయ్యారు. బీసీ, ఈబీసీ కింద 117 యూనిట్లకు సుమారు 1,200 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరందరూ ఇంటర్వ్యూలకు హాజరవుతారని తెలిసి కూడా కార్యాలయ ఆవరణలో ఎలాంటి మౌలిక వసతులు కల్పించలేదు. కాగా, మున్సిపల్ కమిషనర్ నయీమ్ బాధ్యతారాహిత్యమే ఇందుకు కారణమని సీఐటీయూ పట్టణ కార్యదర్శి సాకే నాగరాజు మండిపడ్డారు. ఇంటర్వ్యూలకు పెద్ద సంఖ్యలో దరఖాస్తుదారులు వస్తున్నట్లుగా ముందస్తుగా తమకు ఎందుకు సమాచారమివ్వలేదని మున్సిపల్ కమిషనర్ నయీమ్, సంబంధిత అధికారులను పోలీసు అధికారులు నిలదీశారు. తొక్కిసలాట జరిగితే బాధ్యత వహిస్తారా అంటూ టూటౌన్ సీఐ మస్తాన్ ప్రశ్నించారు. ఇంటర్వ్యూ తేదీ ఒక్క రోజు ముందు ఖరారు కావడంతో మౌలిక వసతులు కల్పించలేకపోయినట్లు మెప్మా టీపీఆర్‌ఓ మోహన్ తెలిపారు. దీంతో తప్పని పరిస్థితుల్లో ఇంటర్వ్యూలను శుక్రవారానికి వాయిదా వేస్తున్నట్లుగా ప్రకటించారు.

ఉచిత ఎంబీఏ విద్య కోసం 23న పరీక్ష


పోస్టర్లు విడుదల చేస్తున్న యాజమాన్యం

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి సమీపంలోని సంస్కృతి కళాశాలలో ఉచిత ఎంబీఏ కోర్సులో ప్రవేశానికి నిర్వహించే సాయి ప్రుడెంట్ స్కాలర్‌షిప్ పరీక్ష ఈ నెల 23 ఉదయం 9 గంటలకు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను బుధవారం విద్యా సంస్థల చైర్మన్ విజయ్‌భాస్కర్‌రెడ్డి విడుదల చేశారు. అడ్మిషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ ప్రశాంతి, ప్రిన్సిపాల్ అండ్ డీన్ డాక్టర్ బాలకోటేశ్వరి మాట్లాడుతూ రెండేళ్ల ఎంబీఏ విద్యతో పాటు హాస్టల్ సౌకర్యాలను పొందడానికి సాయి ప్రుడెంట్ స్కాలర్‌షిప్ పరీక్షను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఏదైనా డిగ్రీ కోర్సు చదివిన వారు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు 91000 64545, 91009 74544, 91009 74537 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. జర్మనీకి చెందిన అన్‌హటా స్టఫ్టంగ్ ఫౌండేషన్ సహకారంతో ఈ పరీక్ష నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

భూ సమస్యలు పునరావృతం కారాదు

- రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా



రెవెన్యూ అంశాలపై సమీక్షిస్తున్న ఆర్‌పీ సిసోడియా

ప్రశాంతి నిలయం: జిల్లాలో భూముల రీసర్వేను పకడ్బందీగా చేపట్టి భవిష్యత్తులో రైతులకు భూ సమస్యలు తలెత్తకుండా రికార్డులు పక్కాగా రూపొందించాలని సంబంధిత అధికారులను రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా ఆదేశించారు. బుధవారం శ్రీసత్యసాయి జిల్లా కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ సమావేశ మందిరంలో పీజీఆర్‌ఎస్, రీ సర్వే, రెవెన్యూ సదస్సులతో పాటు పలు రెవెన్యూ అంశాలపై కలెక్టర్ టీఎస్ చేతన్‌తో కలసి అధికారులతో ఆయన సమీక్షించారు. ప్రభుత్వ భూముల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని భూముల వర్గీకరణతో కూడిన మ్యాప్‌లు తయారు చేయాలన్నారు. భూముల రిజిస్ట్రేషన్, 22ఏ, డి.నోటిఫైడ్, భూసేకరణ, సమీకరణ, ఫ్రీహోల్డ్, డిజిటలైజేషన్, జాయింట్ ఎల్‌పీఎంల రూపకల్పనతో పాటు ఇతర రెవెన్యూ అంశాలపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్త వహించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీల పరిష్కారానికి అధికారులు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డీఆర్వో విజయసారథి, ఆర్డీఓలు సువర్ణ, శర్మ, మహేష్, ఆనంద్‌కుమార్, 32 మండలాల తహసీల్దార్లు, సర్వేయర్లు పాల్గొన్నారు.

మాతాశిశు సంరక్షణ చర్యలు చేపట్టండి

- వైద్య ఆరోగ్యశాఖ అడిషనల్ డైరెక్టర్ అనిల్‌కుమార్


మాట్లాడుతున్న డాక్టర్ అనిల్‌కుమార్

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లాలో మాతాశిశు సంరక్షణ చర్యలు చేపట్టాలని వైద్యాధికారులను వైద్య ఆరోగ్య శాఖ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ అనిల్‌కుమార్ ఆదేశించారు. హెల్త్ మేనేజ్మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టం ప్రకారం తల్లీబిడ్డల వైద్య సేవలు, గర్భిణుల వివరాల నమోదుపైబుధవారం ఆయన డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీదేవితో కలసి వైద్యాధికారులతో సమీక్షించారు. వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేసి జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు మాట్లాడారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ యుగంధర్, డాక్టర్ అనుపమ, డాక్టర్ రవిశంకర్, ఎస్‌ఓ మహ్మద్ రఫీ, కిషోర్ పాల్గొన్నారు.

పామిడి: మండల కేంద్రంలోని సీహెచ్‌సీతో పాటు రామరాజుపల్లిలోని హెల్త్ క్లినిక్‌ను బుధవారం ఉదయం డాక్టర్ అనిల్‌కుమార్ తనిఖీ చేశారు. ముందుగా పామిడిలోని గుప్తా కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా 11 రకాల వ్యాధులకు సంబంధించిన టీకాలపై కాలనీ వాసులకు అవగాహన కల్పించారు. అనంతరం సీహెచ్‌సీలో పలు రికార్డులు పరిశీలించారు. రామరాజుపల్లిలో హెల్త్ క్లినిక్‌ను పరిశీలించి 14 రకాల ల్యాబ్ పరీక్షల విధానం, ఎన్‌సీడీ సీడీ సర్వేపై ఆరోగ్యసిబ్బందికి అవగాహన కల్పించారు. ఆయన వెంట ఆర్‌బీఎస్‌కే సీఓ నారాయణస్వామి, ఎద్దులపల్లి వైద్యాధికారి సుధాకర్, సిబ్బంది ఉన్నారు.

వనజా అక్కమ్మ రిలీవ్

అనంతపురం సెంట్రల్: మహిళాశిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ వనజా అక్కమ్మ రిలీవ్ అయ్యారు. కంబదూరు సీడీపీఓగా ఉన్న ఆమెను పదోన్నతిపై నెల రోజుల క్రితం ఐసీడీఎస్ పీడీగా నియామకం చేసిన విషయం తెలిసిందే. అయితే రాజకీయ ఒత్తిళ్ల నేపథ్యంలో ఆమెను ప్రాంగణం మేనేజర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీంతో బుధవారం ఆమె రిలీవ్ అయ్యారు. కొత్త పీడీ నియామకం అయ్యే వరకూ ఇన్‌చార్జ్ పీడీగా ఉరవకొండ సీడీపీఓ శ్రీదేవికి బాధ్యతలు అప్పగించనున్నట్లు సమాచారం.

అహుడా వార్డు ప్లానర్ అనుమానాస్పద మృతి


నాగశ్రీ మృతదేహం

అనంతపురం: అహుడాలో వార్డు ప్లానర్‌గా పని చేస్తున్న నాగశ్రీ(38) అనుమానాస్పద స్థితిలో మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. అనంతపురంలోని మారుతీనగర్‌లో నివాసముంటున్న ఆమె తన ఇంట్లోనే మంగళవారం ఉరికి వేలాడుతూ కనిపించడంతో కుటుంబ సభ్యులు గమనించి పెద్దాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అత్యవసర వైద్య విభాగంలో చేర్చారు. చికిత్సకు స్పందించక బుధవారం ఆమె మృతిచెందింది. కాగా, ఈ ఘటనపై పలు అనుమానాలు వ్యక్తం కావడంతో ఆ దిశగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

రీ సర్వే పారదర్శకంగా సాగాలి

- జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ

నార్పల: గ్రామాల్లో రీ సర్వే పనులు పారదర్శకంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను జేసీ శివ్‌నారాయణ్ శర్మ ఆదేశించారు. నార్పల మండలం దుగుమర్రిలో చేపట్టిన రీ సర్వే పనులను బుధవారం ఆయన పరిశీలించారు. గ్రామ సరిహద్దులు, బ్లాక్ సరిహద్దులు, ప్రభుత్వ స్థలాల సరిహద్దులు పక్కగా నిర్ణయించాలన్నారు. రీ సర్వే చేసే గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించి అనుమానాలు నివృత్తి చేయాలన్నారు. వారి సమక్షంలోనే రీసర్వే పనులు చేపట్టాలన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు.

హంద్రీ-నీవా లైనింగ్ పనుల అడ్డగింత


హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులను అడ్డుకుంటున్న రైతులు

కనగానపల్లి: హంద్రీ-నీవా కాలువ సిమెంట్ లైనింగ్ పనులను రైతులు అడ్డుకున్నారు. ఎవరికో మేలు చేసేందుకు తమకు అన్యాయం చేస్తే చూస్తూ ఊరుకోబోమన్నారు. తగరకుంట సమీపంలోని హంద్రీ-నీవా కాలువ వద్ద లైనింగ్ పనులు చేపట్టేందుకు బుధవారం కాంట్రాక్టర్లు యంత్రాలతో రాగా, విషయం తెలుసుకున్న స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు అక్కడికి వెళ్లి పనులు చేపట్టకూడదన్నారు. కూటమి ప్రభుత్వం హంద్రీ-నీవా కాలువ ద్వారా చిత్తూరు జిల్లాకు కృష్ణాజలాలు తరలించేందుకు తమకు అన్యాయం చేస్తోందని మండిపడ్డారు. కాలువ వెడల్పు, జంగిల్ క్లియరెన్స్‌కు తాము వ్యతిరేకం కాదన్నారు. కానీ కాలువలో సిమెంట్ వేసి లైనింగ్ చేస్తే ఒప్పుకోబోమన్నారు. కార్యక్రమంలో తగరకుంట, పాతపాల్యం గ్రామాల సర్పంచ్‌లు మాధవరాజులు, రాజాకృష్ణ, పలువురు రైతులు పాల్గొన్నారు.

సుత్తితో మోది.. బంగారు నగల అపహరణ


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న లక్ష్మమ్మ

ఓడీచెరువు: ఇంటి తలుపుతట్టిన దుండగులు...డోరు తీసిన మహిళ నెత్తిపై సుత్తితో మోది ఆమె వంటిపై ఉన్న ఆభరణాలు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన మంగళవారం రాత్రి ఓడీచెరువులో చోటుచేసుకుంది. బాధితురాలు పోలీసులకు తెలిపిన వివరాల మేరకు... వైద్య,ఆరోగ్యశాఖ విశ్రాంత ఉద్యోగి లక్ష్మమ్మ స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలోనే ఒంటరిగా నివాసం ఉంటోంది. మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో దుండగులు తలుపు తట్టి పేరుపెట్టి పిలిచారు. దీంతో ఆమె తలుపుతీయగానే సుత్తితో తలపై కొట్టడంతో అక్కడే స్పృహ తప్పి పడిపోయింది. అనంతరం ఆమె మెడలోని గొలుసు, చేతికున్న బంగారు గాజులను దుండగులు తీసుకెళ్లిపోయారు. కాసేపటి తర్వాత మెలుకున్న లక్ష్మమ్మ తన కూతురుకు ఫోన్ చేసి విషయం తెలిపడంతో ఆమె వచ్చి తల్లిని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లింది. అనంతరం స్థానిక పోలీసులకు ఈ ఘటనపై ఫిర్యాదు చేసింది. మొత్తంగా 14 తులాల బంగారు నగలు దుండగులు అపహరించినట్లు పేర్కొంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి ఆత్మహత్య

ధర్మవరం అర్బన్: అప్పులు తీర్చే మార్గం కానరాక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు.. ధర్మవరంలోని సత్యసాయి నగర్‌కు చెందిన అశోక్ (35) ఇటుకల బట్టీతో పాటు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టి నష్టపోయాడు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లతో అప్పుల పాలయ్యాడు. అప్పులు ఎలా తీర్చాలో తెలియక కొంత కాలంగా మదన పడుతున్న అశోక్ బుధవారం ఉదయం ద్విచక్ర వాహనంపై చెన్నేకొత్తపల్లిలోని బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తూ ప్యాదిండి సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేశారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

గుంతకల్లు టౌన్: ఒడిశా నుంచి గంజాయిని దిగుమతి చేసుకుని గుంతకల్లు, తాడిపత్రి ప్రాంతాల్లో విక్రయిస్తున్న గుంతకల్లుకు చెందిన షికారి నాగులు, అశోక్ కుమార్, తాడిపత్రి నివాసి యర్రగుడి అల్తాఫ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. అందిన పక్కా సమాచారంతో బుధవారం ఉదయం గుంతకల్లులోని ఆలూరు రోడ్డులోని దర్గా ఆర్చ్ వద్ద తచ్చాడుతున్న ముగ్గురినీ అదుపులోకి విచారణ చేయడంతో గంజాయి విక్రయం బయటపడినట్లు వన్‌టౌన్ సీఐ మనోహర్ తెలిపారు. వీరి నుంచి 1,100 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.



ఆకాంక్ష బలీయం

పిల్లలు కాస్త మారాం చేయగానే సెల్‌ఫోన్ చేతికి ఇచ్చేసి తమ దైనందిన కార్యక్రమాలు చేసుకోవడం ప్రస్తుతం కొనసాగుతున్న ట్రెండ్. అయితే ఇందుకు భిన్నంగా ఓ చిన్నారి బుధవారం ఉదయం 7 గంటల సమయంలో కలెక్టరేట్ ఎదురుగా తోపుడి బండిపై ఇలా పలకా బలపం చేతపట్టి తనకు వచ్చిన అక్షరాలు రాస్తూ కనిపించింది. చదువుకోవాలన్న ఆకాంక్ష బలంగా ఉన్న చిన్నారి కుటుంబ పెద్దలతో కలసి తోపుడు బండిపై కలెక్టరేట్ వద్దకు చేరుకుని అక్కడే అక్షరాలు నేర్చుకుంటోంది. ఈ దృశ్యాన్ని అటుగా వెళుతున్న వారు ఆసక్తిగా గమనించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

క్లుప్తంగా

శ్రీశైలం తరలిన మాలధారులు



ఇరుముడులతో శ్రీశైలం బయలుదేరుతున్న మాలధారులు

రాప్తాడు: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైలం మల్లికార్జున స్వామిని దర్శించుకునేందుకు రాప్తాడు నుంచి 45 మంది శివ మాలధారులు బుధవారం ఇరుముడులతో శ్రీశైలం బయలుదేరి వెళ్లారు. గురు స్వాములు చిట్రా నాగేంద్ర, పామాల రామచంద్ర, తలారి శివయ్య, గోరవ శివయ్య ఆధ్వర్యంలో ఉమా నీలకంఠేశ్వర స్వామికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. గ్రామ ప్రజలు మేళతాళాలతో ఊరేగింపుగా వెళ్లి పొలిమేరలో సాగనంపారు. శ్రీశైలం మల్లన్నకు ఇరముడి ఇచ్చి.. శివరాత్రి మరుసటి రోజు దీక్ష విరమిస్తారని గురుస్వాములు తెలిపారు. అలాగే మండలా వ్యాప్తంగా పలు గ్రామాల్లో శివస్వాములు శ్రీశైలం తరలివెళ్లారు.

'సూపర్ సిక్స్' అమలు చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నేతలు

ఆత్మకూరు: ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి శివశంకర్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై సీపీఎం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి లక్ష కోట్లు కేటాయించాలని కోరారు. రైతు భరోసా రూ.20 వేలు అందించాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. ఇచ్చిన హామీలన్నింటినీ వెంటనే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రామయ్య, వలి, రాజేశ్వరమ్మ, లక్ష్మన్న, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



ఎంపీ అంబికాకు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

అనంతపురం సెంట్రల్: రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయశాఖలో కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్న తమకు ఉద్యోగ భద్రత, మినిమమ్ టైమ్ స్కేల్ వర్తింపజేయాలని మల్టీపర్పస్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్స్ (ఎంపీహెచ్‌ఓలు) విజ్ఞప్తి చేశారు. బుధవారం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణను ఆయన క్యాంపు కలిసి వినతిపత్రం అందజేశారు. ఎంపీఈఓల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామంటూ ఎంపీ హామీ ఇచ్చినట్లు ఉద్యోగులు తెలిపారు.

పట్టుదలతో ఏదైనా సాధ్యమే



ఫుట్‌బాల్ క్రీడాకారిణి అనూషను సన్మానిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: ప్రతిభకు పేదరికం అడ్డుకాదు. పట్టుదల ఉంటే సాధించలేనిది ఏమీ ఉండదని ఆత్మకూరుకు చెందిన ఫుట్‌బాల్ క్రీడాకారిణి మండల అనూష నిరూపించిందని పలువురు కొనియాడారు. ఏపీ నుంచి భారత మహిళా ఫుట్‌బాల్ జట్టుకు ఎంపికై న అనూషను బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సన్మానించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ ముందుకెళ్లడంత గర్వంగా ఉందని ఉపాధ్యాయులు తెలిపారు. అనంతరం అనూష తల్లిదండ్రులు రామలక్ష్మి, చంద్రను పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ నరసింహారెడ్డి, ఉప సర్పంచ్ తైదుల శివారెడ్డి, ఎస్‌ఎంసీ చైర్మన్ మండల బొమ్మయ్య, మాజీ ఎస్‌ఎంసీ చైర్మన్ కందుల ఓబుళపతి, బాలపోతన్న, అక్కులన్న ఉపాధ్యాయులు శ్రీనివాస మూర్తి, శీన, గురురాజు, రామాంజనేయులు, గోవర్దన్, నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి జాగరణ పోస్టర్ల ఆవిష్కరణ

అనంతపురం కల్చరల్: టీటీడీ, హిందూ ధర్మప్రచార పరిషత్ సహకారంతో అనంతలో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు హిందూ ధర్మప్రచార మండలి కార్యనిర్వాహకుడు శ్రీపాద వేణు తెలిపారు. బుధవారం దత్త అవతార స్వరూపులైన మాణిక్యప్రభు మహారాజ్ శిష్యుడు రాఘవేంద్ర మాణిక్యప్రభు చేతుల మీదుగా శివరాత్రి జాగరణ మహోత్సవ పోస్టర్లను ఆవిష్కరించారు. రామచంద్ర నగర్‌లోని టీటీడీ కల్యాణ మండపం వేదికగా శివరాత్రి సందర్భంగా ఆదిశంకరుల కల్యాణ మహోత్సవం, మహాగణపతి పూజ సంకల్పం, మహాత్రిపుర సుందరి సమేత పరమేశ్వర సహస్రలింగార్చన జరుగుతాయని తెలిపారు. 50 మంది దంపతులకు దత్తాత్రేయస్వామి పాదుకలను వితరణ చేస్తామన్నారు. ఇందుకోసం టీటీడీ కల్యాణ మండపంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాగలింగారెడ్డి, ధనుంజయ్, వెంకటాద్రినాయుడు, సతీష్, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటు వేయలేదని రాళ్లతో వీరంగం

- గత ఏడాది జూన్ 4న కూటమి ప్రభుత్వం విజయం సాధించడంతో నియోజకవర్గంలో టీడీపీ కార్యకర్తలు దాడులు చేశారు. పాలచెర్ల గ్రామంలో తమకు ఓటు వేయలేదని గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు శేఖర్, లింగమయ్యపై టీడీపీ కార్యకర్తలు రాళ్ల దాడి చేశారు. ఈ ఘటనలో శేఖర్, లింగమయ్యకు తీవ్ర గాయాలయ్యాయి.



పాలచెర్లలో టీడీపీ నాయకుల దాడిలో గాయపడ్డ శేఖర్ (ఫైల్)

సచివాలయంపై దాడి



పాలచెర్ల గ్రామ సచివాలయం కిటికీలను పగులగొట్టిన దృశ్యం (ఫైల్)

మండలంలోని పాలచెర్ల గ్రామంలో వైఎస్సార్‌సీపీకి మెజార్టీ రావడంతో టీడీపీ కార్యకర్తలు జీర్ణించుకోలేదు. గ్రామ సచివాలయంపై దాడి చేశారు. సచివాలయ సిబ్బందిని బెదిరించి, కిటికీ అందాలు ధ్వంసం చేశారు. కంప్యూటర్‌పై నీళ్లు పోసి, ప్రింటర్, బాత్ రూమ్ డోర్లను పగులగొట్టారు. సచివాలయం పైన ఉన్న సింథటిక్ ట్యాంకు పైపులను పగులగొట్టారు. అదేవిధంగా మండలంలోని హంపాపురం గ్రామంలోని వెల్‌నెస్ కేంద్రం శిలాఫలకం, గొందిరెడ్డిపల్లి గ్రామంలో సచివాలయ శిలాఫలకాన్ని టీడీపీ నాయకులు ధ్వంసం చేశారు.



గొందిరెడ్డిపల్లి సచివాలయంలో ధ్వంసమైన శిలాఫలకం (ఫైల్)

రెచ్చిపోతున్న పచ్చరౌడీలు

- వైఎస్సార్‌సీపీ నేతలే లక్ష్యంగా దాడులు
- ఇటీవల కనగానపల్లి మండలంలో చాకలి నరసింహులుపై కొడవళ్లతో దాడి
- రెండు నెలల క్రితం ఓ ప్లాటు విషయంలో ఇద్దరు మహిళలపై దాడి
- ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న వైనం
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న పోలీస్ యంత్రాంగం

కొడవళ్లతో హల్‌చల్..



గాయపడిన నాగమ్మ, లక్ష్మీనారాయణమ్మ (ఫైల్)

- రాప్తాడు మండలం భోగినేపల్లిలో గత ఏడాది నవంబర్ 3న ఇద్దరు మహిళలపై టీడీపీ నాయకులు అతికిరాతకంగా ఇనుప రాడ్లు, కొడవళ్లతో దాడి చేసి గాయపరిచారు. ఎవరైనా అడ్డు వస్తే నరికివేస్తామంటూ నానా హంగామా చేశారు. ఇంటి స్థలం విషయంలో వైఎస్సార్‌సీపీ సానుభూతి మహిళలు ఎలగొండ నాగమ్మ, ఆమె అక్క కుమార్తె కోలా లక్ష్మీనారాయణమ్మపై టీడీపీ నాయకులు కరె వెంకటేష్, అతని కుమారుడు, ప్రస్తుత ఫీల్డ్ అసిస్టెంట్ కరె ప్రసాద్ మద్యం తాగొచ్చి దాడి చేశారు. ఇప్పుడున్నది మా ప్రభుత్వం.. మీకు దిక్కెవరూ అంటూ కొడవళ్లతో భయానక వాతావరణం సృష్టించారు.

మాకు వ్యతిరేకంగా పని చేస్తావా?



గాయపడిన చాకలి నరసింహులు (ఫైల్)

- స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా పని చేశాడనే కారణంతో ఇటీవల కనగానపల్లి మండలం గుంతపల్లికి చెందిన చాకలి నరసింహులుపై టీడీపీ నాయకులు కొడవళ్ల దాడి చేశారు. ఎంపీపీ కుంపటి భాగ్యమ్మ, మండల కన్వీనర్ నాగమునికి ముఖ్య అనుచరుడు చాకలి నరసింహులు. తరగకుంటకు వ్యక్తిగత పనిపై వచ్చిన నరసింహులుతో తూంచర్లకు చెందిన టీడీపీ నాయకుడు బోయ చెన్నప్ప, అతని అనుచరులు ఎదురు పడి గొడవ పెట్టుకున్నారు. అంతలోనే పథకం ప్రకారం తమ వెంట తెచ్చుకున్న వేట కొడవళ్లతో అతి కిరాతంగా కుడి కాలిని నరికివేశారు. స్థానికులు అడ్డుపడటంతో టీడీపీ నాయకులు పారిపోయారు. తీవ్రంగా గాయపడిన నరసింహులును అనంతపురం తరలించి చికిత్స చేయించారు.

రాప్తాడు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలో తెలుగు తమ్ముళ్ల దౌర్జన్యాలు పెచ్చుమీరాయి. టీడీపీ నాయకుల అరాచకాలు పెరగడంతో రోజూ ఏదో ఒక గ్రామంలో దాడులు జరుగుతున్నాయి. ప్రభుత్వ భూములు, స్థలాలు, చివరకు ప్రైవేటు ఆస్తులతో పాటు శ్మశాన స్థలాలను సైతం వదలకుండా కబ్జా చేస్తున్నారు. మరో పక్క వచ్చింది మా ప్రభుత్వం.. తమదే జరగలంటూ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను టార్గెట్ చేస్తూ దాడులు చేయిస్తున్నారు. ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. తమకు అడ్డు వస్తున్న నాయకులను పోలీస్‌స్టేషన్లకు పిలిపించి కేసులు నమోదు చేయిస్తున్నారు. మరో వైపు ప్రభుత్వ కార్యాలయాలకు వైఎస్సార్‌సీపీ నాయకుల పేర్లు, ఫొటోలు ఉండకూడదంటూ శిలాఫలాకాలను ధ్వంసం చేస్తున్నారు. తమకు గ్రామంలో ఎవరూ పోటీ ఉండకూడదనే లక్ష్యంతో వైఎస్సార్‌సీపీ నాయకులు సాగు చేస్తున్న మొక్కలను నరికి వేస్తున్నారు. ఇంత అలజడులు జరుగుతున్నా పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు. టీడీపీ నాయకులే దాడులు చేస్తున్నా పోలీసులు వైఎస్సార్‌సీపీ నాయకులే దాడులు చేస్తున్నారంటూ కేసులు నమోదు చేయడం విడ్డూరంగా ఉంది.

ప్రేక్షకపాత్ర వహిస్తున్న పోలీసులు

గ్రామాల్లో టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ నాయకులపై యథేచ్ఛగా దాడులు చేయిస్తున్నారు. ఇప్పుడున్నది మా ప్రభుత్వం.. మీకు దిక్కెవరంటూ దాడులకు తెగబడుతున్నారు. టీడీపీ నాయకులే దాడి చేసి.. వైఎస్సార్‌సీపీ నాయకులపై ఎదురు కేసులు పెడుతున్నారు. చేసేదేమీ లేక వైఎస్సార్‌సీపీ నాయకులు మిన్నకుండిపోతున్నారు. రాప్తాడులో వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని ఫ్లెక్సీలను ఏర్పాటు చేసుకుంటే వాటని టీడీపీ నాయకులు చించివేశారు. ఇదేమని ప్రశ్నించిన వైఎస్సార్‌సీపీ నాయకులపై కేసులు నమోదు చేయించారు. ఇటీవల రాప్తాడు మండలం పుల్లలరేవు గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడి పెద్ద ఓబులేష్ చెట్లను టీడీపీ నాయకులు నరికివేశారు. శాంతించని టీడీపీ నాయకులు.. పొలానికి రెండు సార్లు నిప్పు పెట్టారు. దీనిపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయకుండా ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు. ఒక్క రాప్తాడులోనే కాకుండా నియోజకవర్గంలో ప్రతి మండలంలోనే పోలీసుల తీరు ఇలానే ఉంది.

రైతుల ఖాతాల్లో నగదు జమ చేయాలి



కలెక్టర్ వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

అనంతపురం అర్బన్: రైతుల నుంచి ప్రభుత్వం కొనుగోలు చేసిన కందులకు సంబంధించిన నగదును వెంటనే వారి ఖాతాల్లోకి జమ చేసేలా చర్యలు తీసుకోవాలని రైతు సంఘం నాయకులు కోరారు. బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వి.వినోద్ కుమార్‌ను రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిరుతల మల్లికార్జున, అధ్యక్షుడు చిన్నప్ప యాదవ్, ఇతర నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లాలో ఆశించిన స్థాయిలో కంది దిగుబడి రాలేదన్నారు. ఆరేడు క్వింటాళ్లకు గానూ ఒకట్రెండు క్వింటాళ్లు వచ్చిందన్నారు. పెట్టుబడి రాక రైతులు అప్పులపాలయ్యారన్నారు. మరోవైపు గిట్టుబాటు ధర లేక నష్టపోతున్నారని తెలిపారు. ఈ దశలో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.7,550తో మేలు కలగడం లేదన్నారు. రైతుల శ్రేయస్సు దృష్ట్యా రూ.2,450 బోనస్ ప్రకటించి క్వింటాల్‌కు రూ.10 వేలు అందించి ఆదుకోవాలన్నారు. కలెక్టర్ స్పందిస్తూ.. సంబంధిత అధికారులతో మాట్లాడి రైతులకు నగదు జమయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు రామకృష్ణ, నాయకులు మధు యాదవ్, శ్రీకాంత్, ధనుంజయ, ఆశోక్, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

25 వేల పోస్టులతో డీఎస్సీ ప్రకటించాలి



కలెక్టరేట్ పరిపాలనాధికారి అలెగ్జాండర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అనంతపురం అర్బన్: కూటమి ప్రభుత్వం నిరుద్యోగ యువత భవిష్యత్తుతో ఆటలాడుతోందని ఏఐవైఎఫ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి సంతోష్ కుమార్ మండిపడ్డారు. 25 వేల పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహించాలనే తమ డిమాండ్‌ను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కలెక్టరేట్ పరిపాలనాధికారి అలెగ్జాండర్‌కు నాయకులు విన్నవించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. మెగా డీఎస్సీపై ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన తొలి సంతకానికి దిక్కులేకుండా పోయిందన్నారు. వేలాది రూపాయలు వెచ్చించి కోచింగ్ తీసుకున్న లక్షలమంది నిరుద్యోగులు తీవ్ర నిరాశకు గురవుతున్నట్లు పేర్కొన్నారు. మెగా డీఎస్సీ నిర్వహిస్తారా లేదా అనే అయోమయంలో పలువురు అభ్యర్థులు ఆత్మహత్యకు పాల్పడుతున్న సందర్భాలు ఉన్నాయన్నారు. అనంతపురం, కర్నూలు, వైఎస్సార్, నెల్లూరు, ప్రకాశం, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు పోస్టుల మంజూరులో అన్యాయం జరిగిందని తెలిపారు. 16,347 పోస్టులతో కాకుండా 25 వేల పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధక్షుడు కోట్రేష్, ఉపాధ్యక్షుడు దేవేంద్ర, కార్యదర్శి ధనుంజయ, రాష్ట్ర సమితి సభ్యుడు మురళీ, నగర కార్యదర్శి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం



మాట్లాడుతున్న మాల వెల్ఫేర్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ విజయ్‌కుమార్

అనంతపురం రూరల్: ఎస్సీల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తుందని మాల వెల్ఫేర్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ విజయ్‌కుమార్ తెలిపారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన బుధవారం దామోదరం సంజీవయ్య భవనంలో విలేకరులతో మాట్లాడారు. క్షేత్రస్థాయిలో పర్యటించి ఎస్సీల సమస్యలపై అధ్యయనం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమశాఖ డీడీ (ఇన్‌చార్జ్) రాధిక తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ స్థలాలు కాపాడాలి

ఎస్సీ కార్పొరేషన్‌కు సంబంధించిన స్థలాలను కాపాడాలని మాల వెల్ఫేర్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ చైర్మన్ విజయ్‌కమార్‌ను ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి కోరారు. రుద్రంపేట సమీపంలో ఉన్న అంబేద్కర్ భవనంలో పోక్సో కోర్టు ఏర్పాటు చేశారన్నారు. అక్కడ ఎస్సీ విద్యార్థులకు నైపుణ్య శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా నగరంలో ఉన్న ఎస్సీ కార్పొరేషన్ సంబంధించిన షాపులకు పది సంవత్సరాలకు ఒకసారి టెండర్ నిర్వహించి ఎస్సీలకు ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

చెత్తను డంపింగ్ యార్డుకు తరలించండి



సూచనలిస్తున్న కమిషనర్ బాలస్వామి

అనంతపురం ఎడ్యుకేషన్: తొలిగించిన చెత్తను ఎప్పటికప్పుడు డంపింగ్ యార్డుకు తరలించాలని నగర పాలక సంస్థ కమిషనర్ బాలస్వామి ఆదేశించారు. పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా బుధవారం నగరంలోని శ్రీనగర్ కాలనీ, మారుతి నగర్, రహమత్ నగర్, లక్ష్మీనగర్, కోవూరు నగర్, జన్మభూమి రోడ్డు తదితర ప్రాంతాలను పరిశీలించారు. స్థానిక జన్మభూమి రోడ్డులో ఎండిన ఆకులను కుప్పలుగా చేసి నిప్పు పెట్టడం గమనించిన కమిషనర్ వెంటనే పారిశుధ్య కార్మికుడిని పిలిపించి వాటిని ఆర్పించారు. చెత్తనంతా వాహనల్లో డంపింగ్ యార్డుకు తరలించాలని ఆదేశించారు. ఇలా రోడ్డుపై ఉండే చెత్తకు నిప్పు పెడితే ఈ ప్రాంతమంతా దట్టమైన పొగతో కాలుష్యం ఏర్పడుతుందన్నారు. పొగను పీల్చితే శ్వాస సంబంధిత వ్యాధుల బారినపడతారన్నారు. చెత్త నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రీ ప్రైమరీ స్కూల్‌కు టేబుల్స్ వితరణ



మాట్లాడుతున్న ఎస్పీ జగదీష్, ఆర్డీటీ మహిళా సాధికారత డైరెక్టర్ విశాల ఫెర్రర్

అనంతపురం: పోలీస్ రక్షక్ ప్రీ ప్రైమరీ స్కూల్‌కు రూ.1.40 లక్షల విలువ చేసే 40 టేబుల్స్‌ను ఆర్డీటీ, భవిష్య ఇరిగేషన్స్ సంస్థ సభ్యులు అందజేశారు. ఎస్పీ పి.జగదీష్, ఆర్డీటీ మహిళా సాధికారత విభాగం డైరెక్టర్ విశాల ఫెర్రర్ తదితరులు బుధవారం పోలీస్ రక్షక్ ప్రీ ప్రైమరీ స్కూల్‌ను సందర్శించారు. పిల్లలతో కాసేపు ముచ్చటించారు. పోలీసు పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఇప్పటికే స్పానిష్ టీచర్‌ను నియమించామన్నారు. కార్యక్రమంలో అర్బన్ డీఎస్పీ వి.శ్రీనివాస రావు, ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వర్ రెడ్డి, సీఐలు క్రాంతి కుమార్, ధరణి కిశోర్, విశ్వనాథ చౌదరి, ఆర్ఐ మధు, ఆర్డీటీ హౌసింగ్ డైరెక్టర్ రాజశేఖర్ రెడ్డి, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడ్‌హక్ కమిటీ సభ్యుడు సాకే త్రిలోక్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

మయూర వాహనంపై ఆదిదంపతుల విహారం



అలంకరణలో పార్వతీ పరమేశ్వరులు

అనంతపురం కల్చరల్: శ్రీశైలాన్ని తలపిస్తూ పది రోజుల పాటూ సాగే మహాశివరాత్రి వేడుకలు బుధవారం మొదటి రోడ్డు శ్రీకాశీవిశ్వేశ్వరాలయంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ఈఓ రమేష్ బాబు నేతృత్వంలో వేదపండితులు, ధ్వజారోహణంతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. అనంతరం సుప్రభాత సేవ, మహాశివుడికి మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, ఏకవార రుద్రాభిషేకాలు, అర్చనలు జరిగాయి. మహామంగళహారతి, తీర్థప్రసాద వితరణ నిర్వహించారు. ఆలయ అనువంశీకులు హోసూరు రామసుబ్రహ్మణ్యం సంప్రదాయసిద్ధంగా దీక్షా వస్త్రాలు, తొమ్మిది రోజుల పాటూ వేడుకలకు అవసరమైన పూజాద్రవ్యాలను అర్చకులకు అందించారు. తొలిరోజు ఆదిదంపతులు మయూర వాహనంపై నగరవీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. ప్రాచీన కళారూపాలు, భజన బృందాల సందడి నెలకొంది.

సంక్షిప్త సమాచారం

విద్యుత్ శాఖ ఎస్ఈ బదిలీని ఆపాలి

అనంతపురం టవర్‌క్లాక్: విద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్ కుమార్‌ను కారణం లేకుండా బదిలీ చేయడం దారుణం. వెంటనే ఆయన బదిలీని ఆపాలని ఎస్సీ, ఎస్టీ ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ రవిరాజా డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయం ఎదురుగా ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంలో నీతి, నిజాయితీగా విధులు నిర్వర్తించే అధికారులను అక్రమంగా బలి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శివ శంకర్, గిరిజన ప్రజా సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షులు మల్లికార్జున నాయక్, మంత్రి సుదర్శన్, పులి కిష్ట, చిన్న పెద్దన్న, చంద్ర, పక్కీరప్ప, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రీ స్కూళ్ల బలోపేతానికి కృషి చేయాలి

రాప్తాడు: ప్రీ స్కూళ్లను బలోపేతం చేయడానికి అంగన్‌వాడీ కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని ఎంఈఓ మల్లికార్జున పేర్కొన్నారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండో రోజు జ్ఞాన జ్యోతి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యాభివృద్ధి కోసం వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలిపారు. అంగన్‌వాడీ వర్కర్ల బోధనతీరు మెరుగుపరిచేందుకు 120 రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శిక్షణ తరగతులకు తప్పని సరిగా హాజరు కావాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 కుళ్లాయప్ప, సూపర్‌వైజర్స్ నాగరత్న, హేమలత, రిసోర్స్ పర్సన్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోండి

అనంతపురం టవర్‌క్లాక్: ప్రభుత్వ, ప్రైవేట్ భూములను కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజాబలం సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు చందు నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆయన విలేకరుతో మాట్లాడారు. నగరంలో కొంత మంది రౌడీ షీటర్లు, గుండాలు, కుల, ప్రజా సంఘాల నాయకులు ధనార్జన కోసం ప్రభుత్వ, ప్రైవేట్ భూములను కబ్జా చేస్తున్నారన్నారు. అమాయకులతో గుడిసెలు వేయించి వారితో డబ్బు వసూలు చేస్తున్నట్లు ఆరోపించారు. స్థలాలతో పాటు ఇంటి పట్టాలు ఇస్తామని చెప్పి నకిలీ పట్టాలు ఇచ్చారని పేర్కొన్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్న వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న జిల్లా అదనపు ఎస్పీ డీవీ రమణమూర్తి

అనంతపురం: సైబర్ నేరాలను నిరోధించాలంటే అవగాహన, అప్రమత్తంగా ఉండాలని జిల్లా అదనపు ఎస్పీ డీవీ రమణమూర్తి తెలిపారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకోకుండా అవగాహన కల్పించాలనే సంకల్పంతో జిల్లా ఎస్పీ 'సైబర్ సురక్ష' అనే కార్యక్రమాన్ని చేపట్టారని పేర్కొన్నారు. బుధవారం రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ.. రిటైర్డ్ ఉద్యోగులు కావడంతో అకౌంట్లలో తప్పనిసరిగా డబ్బు ఉంటుందని గుర్తించి సైబర్ నేరగాళ్లు టార్గెట్ చేసే అవకాశం ఉంటుందన్నారు. అపరిచితుల కాల్స్, మెయిల్స్, మేసేజీలకు స్పందించకూడదని పేర్కొన్నారు. అవగాహన లేకపోవడం, అత్యాశ, అమాయకత్వం వల్ల ప్రజలు ఎలా సైబర్ నేరాల ఉచ్చులో పడతారని సైబర్ క్రైం సీఐ షేక్ జాకీర్ వివరించారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు



మాట్లాడుతున్న కెనరా బ్యాంక్ సిబ్బంది

రాప్తాడు: కెనరా బ్యాంక్ ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నట్లు బ్రాంచ్ మేనేజర్ డి.వెంకట సుబ్బయ్య, మేనేజర్ ఆర్.వెంకట కృష్ణ తెలిపారు. బుధవారం కెనరా బ్యాంక్ వద్ద నుంచి స్థానిక బస్టాండు సర్కిల్ మీదుగా వైఎస్సార్ సర్కిల్ వరకు బ్యాంక్ సిబ్బంది ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డిపాజిట్లపై కెనరా బ్యాంక్ 8 శాతం వడ్డీ రేటు వర్తింపజేసిందన్నారు. మహిళా ఖాతాదారులను దృష్టిలో పెట్టుకుని కెనరా బ్యాంకు 'కెనరా ఏంజెల్' ఖాతాను ప్రారంభించిందన్నారు. ఈ ఖాతా ద్వారా వ్యాపారులు, వ్యవసాయం, హౌసింగ్, విద్యార్థులకు సులభంగా రుణాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్కిల్ ఆఫీస్ మేనేజర్ బీజీలీ రూప, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

41 యూనిట్లకు 200 దరఖాస్తులు



దరఖాస్తులను పరిశీలిస్తున్న అధికారులు

ఆత్మకూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం బీసీ, కాపు, ఈబీసీ కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాలకు అందిన దరఖాస్తులను పరిశీలించారు. మండల వ్యాప్తంగా 41 యూనిట్లకు 200 మంది దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. అభ్యర్థులకు సంబంధించిన ఆధార్‌కార్డు, బ్యాంక్ ఖాతాలు, ఇతర ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మీనరసింహ, బ్యాంక్ అధికారులు బాలకొండన్న, యమున తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీ హోమం

అనంతపురం ఎడ్యుకేషన్: అశోక్ నగర్‌లోని మినర్వా పాఠశాలలో బుధవారం సరస్వతీ హోమం అత్యంత వైభవంగా జరిగింది. కరస్పాండెంట్ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థికీ సరస్వతీ కటాక్షం కలగాలని ఆకాంక్షిస్తూ హోమం జరిపించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.